
సాక్షి ఒడిశా
బుధవారం । 28 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.1,46,753
బంగారం	3 గ్రాముల 220 మిల్లీ గ్రాములు
వెండి	30 గ్రాముల 600 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



విద్యుత్ కోతలపై ఆగ్రహం

- బిల్లులు తగ్గించాలని డిమాండ్
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యాలయాల ముట్టడి

- IIలో▸



అంతులేని విషాదం

- రోడ్డు ప్రమాదంలో కుటుంబం దుర్మరణం

- IIలో▸

న్యూస్‌రీల్

రూ.2 లక్షల చొప్పున పరిహారం



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న మంత్రి విక్రమ్ ఆరక్, ఎంపీ చంద్రశేఖర్ తదితరులు

బరంపురం: దిగపండిలో జరిగిన దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు సీఎం నవీన్ పట్నాయక్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతి చెందిన ప్రతి ఒక్కరికీ రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఎప్పటికప్పుడు గంజాం జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాల అస్పత్రిలో చికిత్స నిర్వహిస్తున్నారు. మంత్రి విక్రమ్ ఆరక్, బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహులు దగ్గరుండి పరివేక్షించారు.

పాత్రికేయుల సంరక్షణ చట్టం అవసరం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

రాయగడ: ఇటీవల పాత్రికేయులపై దాడులు పెరుగుతున్న తరుణంలో పాత్రికేయుల సంరక్షణ చట్టం అమలు చేయాలని రాష్ట్ర పాత్రికేయుల సంఘం (ఎస్‌యూజే) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు శివప్రసాద్ గౌడో ఆధ్వర్యంలో కలెక్టర్ సాదాదేవ్ సింగ్‌కు 11 డిమాండ్లతో వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. వార్తలు సేకరించే సమయంలో తరచూ దాడులను నిర్వహిస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పాత్రికేయులను సంరక్షించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సుభాష్ సూర్య, సభ్యులు సహదేవ్ సాహు, గౌరి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

18 పాము పిల్లలు



పాము పిల్లలను చూపిస్తున్న సేనాపతి

రాయగడ: స్థానిక పాత ఎల్‌బీసీ కాలనీలో నివాసముంటున్న భరత్ బెనియా ఇంటి వెనుక 18 పాము పిల్లలు మంగళవారం కనిపించాయి. ఇంటి వెనుక పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు వెళ్లిన బెనియాకు ఒక మూల పుట్ట కనిపించింది. దాని నుంచి ఒక్కొక్కటి బయటకు రావడంతో భయాందోళన చెందిన ఆయన, వెంటనే స్నేక్ స్నేచర్ ప్రదీప్ సేనాపతికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సేనాపతి పాము పిల్లలను పట్టుకుని సమీపంలో ఉన్న అడవిలో విడిచిపెట్టాడు. దీంతో బెనియా కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు.

25 లక్షల మొక్కలు నాటేందుకు నిర్ణయం



పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన మొక్కలు

జయపురం: సబ్ డివిజన్‌లో పరిధి 6 అటవీ రేంజ్‌లలో ఈ ఏడాది 2,545 హెక్టార్లలో 25,80,200 మొక్కలు నాటేందుకు అటవీ శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమం జూలై మొదటి వారం నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డివిజనల్ ఫారెస్టు అధికారి వర్గాల ద్వారా తెలిసింది. జయపురం అటవీ డివిజన్‌లో ఉన్న 6 రేంజ్‌లలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు 5 లక్షల మొక్కలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే జయపురం, బొరిగుమ్మ, బొయిపరిగుడ సమితుల్లో 20 హెక్టార్లలో వెదురు మొక్కలు నాటనున్నారు. బొయిపరిగుడ అటవీ రేంజ్‌లో అటవీ విభాగం ఆధ్వర్యంలో 4,80,000 వేల మొక్కలు నాటటంతో పాటు ఒక లక్ష మొక్కలు పంపిణీ చేయడానికి నిర్ణయించారు. కుంద్ర అటవీ విభాగం ద్వారా 2,80,000 మొక్కలు నాటడంతో పాటు, 50,000 మొక్కలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. వీటిలో పనస, ఉసిరి, చింత, మామిడి, వేప, నిమ్మ, వెదురు తదితర మొక్కలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

సంధ్యా దర్శనం పుణ్యఫలం

- అడప మండపంపై జగన్నాథుడి చివరి దర్శనం
- బారులుతీరిన భక్తులు
- నేడు మారు(బహుడా) రథయాత్ర



స్వామి బొడొ సింగారొ అలంకారం



సంధ్యా దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

భువనేశ్వర్: జగన్నాథుని గుండిచా యాత్ర చివరి దశకు చేరుకుంది. ఈ మందిరం అడప మండపంపై చతుర్థామూర్తుల చివరి దర్శనమైన సంధ్యా దర్శనం అత్యంత ఫలప్రదం. నీలాద్రి యందు పది సంవత్సరాలు ఉండి రేయంబవళ్లు దర్శిస్తే వచ్చే దర్శన ఫలం, గుండిచా మండపమున ఒక్కరోజు దర్శనంతో సమానమని అంటారు. అందులోనూ రాత్రి దర్శనం పదిరెట్లు ఫలమమని పేర్కొంటారు. దీంతో పూరీ గుండిచా పుణ్యక్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. అలయంలోని అడపా మండపంపై దేవతామూర్తుల దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. అడపా మండంపై ఇది చివరి దర్శనం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ దర్శనం సంధ్యా దర్శనం, నవమి దర్శనంగా ప్రతీతి. మర్నాడు స్వామిమారు రథయాత్ర బహుడా జరుగుతుంది. ఈ నేపథ్యంలో సేవాదులు అనుబంధ కార్యకలాపాలు సకాలంలో ముగించేందుకు వీలుగా ఈ ఏడాది సంధ్యా దర్శనం నిడివి కుదించారు. సాధారణంగా సంధ్య వేళలో ఈ దర్శనం కోసం భక్తులు మక్కువ కనబరుస్తారు. ఈ ఏడాది ఈ దర్శనం సాయంత్రం 5 గంటల వరకు పరిమితం చేసి ముగించారు. రథయాత్ర, హీరా పంచమి ఉత్సవాల్లో అవాంఛనీయ జాప్యం పునరావృతం కాకుండా రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (ఆర్‌డీసీ) అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. సంధ్యా దర్శనం కోసం అడపా మండపంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆకస్మిక రద్దీని దృష్టిలో ఉంచుకుని పూరీలో అదనంగా ఐదు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం

మంగళవారం వేకువ జామున 3.20 గంటలకు గుండిచా మందిరం తలుపులు తెరిచారు. మంగళ హారతి ఇతరేతర ప్రాతఃకాల సేవాదులను సకాలంలో పూర్తి చేసి, భక్తులకు ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం సౌకర్యం కల్పించారు. ముందుగా ప్రకటించిన ప్రకారం సాయంత్రం 5 గంటల వరకు నిరవధికంగా సంధ్యా దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా అడప మండపంపై చతుర్థామూర్తులు బొడొ సొంగారొ అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించడం విశేషం. సింహద్వారం గుండా దర్శనానికి అనుమతించి, గుండిచా నక్కొ ఛొణ ద్వారం గుండా వెలుపలకు పంపించారు. అడపా ఒబొఢొ (మహా ప్రసాదం) కోసం భక్త జనం ఉవ్విళ్లూరింది.

సపరివార సమేతంగా

పూరీ గజపతి మహారాజా దివ్య సింఘ్ దేవ్ అడప మండపంపై చతుర్థామూర్తులను సపరివార సమేతంగా సంధ్యా దర్శనం చేసుకున్నారు. సుమారు అరగంట సేపు ఆయన ఈ దర్శనంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు రాణి, కుమార్తెలు దేవతామూర్తులను దర్శించుకున్నారు. లోక కల్యాణం కోసం స్వామివారిని వేడుకున్నట్లు మహారాజా తెలిపారు. ఈ ఏడాది జరగనున్న బహుడా యాత్ర విజయవంతం కావాలనే ఆకాంక్షతో స్వామి ఆశీస్సులు కోరినట్లు వివరించారు. దర్శనం కోసం ప్రవేశించిన సింహద్వారం గుండానే దర్శనం అనంతరం వెలుపలకు వచ్చారు.

పిన్నమ్మ గుడిలో మిఠాయి తయారీ

నవ దినాత్మక యాత్ర ముగించుకొని జగన్నాథుడు తిరిగి శ్రీమందిరం రత్న వేదిక అలంకరించేందుకు సిద్ధమవుతున్నాడు. స్వామి తిరుగు యాత్రలో పిన్నమ్మ మమకారాన్ని స్వీకరించుకుని ముందుకు సాగడం ఆచారం. సర్వ మానవాళికి ఆత్మీయ అనురాగాలను చాటి చెప్పడమే ఈ ఘట్టం ఉద్దేశం.

ప్రళయ శోషిణి మౌసీ మా

గుండిచా నుంచి శ్రీమందిరం మార్గంలో బొడొదండొ నడిబొడ్డున స్వామి పిన్నమ్మ (మౌసీ మా) గుడి ఉంది. ఇక్కడ పూజలందుకునే మౌసీ మా ప్రళయ శోషిణి. శ్రీమందిరానికి ప్రళయ ముప్పు నివారిణిగా భావించి పూజిస్తారు. ప్రాకృతిక విపత్తుల నుంచి స్వామి నిత్యం నెలకొనే శ్రీమందిరాన్ని రక్షించే జనని. ఈ క్రమంలో ఇక్కడి అధిష్టాన దేవత అర్ధాషిణి లేదా అర్ధ శోషిణిగా పేరొందినట్లు భక్తజనాదరణ పొందిన కథనం. తిరుగు ప్రయాణంలో ఈ ఆలయం ముంగిట రథాలు ఆగడం ఆచారం. బిడ్డల కోసం పిన్నమ్మ అత్యంత ఆప్యాయంతో మిఠాయి నివేదిస్తుంది. ఈ మిఠాయి పొడొ పిఠాగా ప్రసిద్ధి. ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే స్వామికి ఈ వంటకం నివేదిస్తారు. స్వామివారికి నివేదించే పలు రుచికర వంటకం ప్రసాదాలు శ్రీమందిరం ఆనంద బజార్ ప్రాంగణంలో కొనుగోలుకు లభిస్తాయి. మౌసీ మా పొడొ పిఠా బహుడా యాత్రలో ప్రత్యక్షంగా పాల్గొన్న భక్త జనులకు ఉచితంగా లభిస్తుంది. ఇది రుచి చూడగలగడమే అపురూపం.



సంధ్యా దర్శనం చేసుకున్న పూరీ గజపతి మహారాజా

పొడొ పిఠా తయారీ

అత్యంత నియమ నిష్టలతో సంప్రదాయాల ప్రకారం పొడొ పిఠా తయారు చేస్తారు. ఏటా హీరా పంచమి రోజున సంప్రదాయ ఇటుకల పొయ్యిని తయారు చేస్తారు. ముందుగా ఛెన్న, మైదా, పంచదార, ఏలకుల పొడి, లవంగాలు, పిస్తా పప్పులు మరియు నెయ్యి మిశ్రమం సిద్ధం చేస్తారు. ఆవిరి ప్రక్రియలో ఈ మిశ్రమాన్ని ఉడికిస్తారు. సుమారు 7, 8 గంటలు ఉడికించి చల్లబరచి క్రమపద్ధతిలో ముక్కలుగా కోసి శుద్ధ నేతిలో దేవడంతో స్వామికి అత్యంత ప్రియమైన మిఠాయి పొడొ పిఠా తయారవుతుంది. మూడు వేర్వేరు మట్టి పాత్రల్లో మిఠాయి సిద్ధం చేసి రథాలపై వేంచేసిన బిడ్డలకు పిన్నమ్మ నివేదిస్తుంది. ఆత్మీయులను మమకారంతో సాగనంపే సందర్భంగా మిఠాయిని అందజేసే సత్సంప్రదాయం నేటి సమాజంలో అడుగడుగున తారసపడుతుంది. సభ్య సమాజాన్ని ఏకతాటిపై నడిపించేందుకు జగన్నాథుని రథయాత్ర ప్రేరణగా నిలుస్తుంది.



మౌసీ మా (పిన్నమ్మ) గుడి



బహుడా కోసం నక్కొ ఛొణ ద్వారం ముంగిట నిలిచిన రథాలు

బహుడా కార్యక్రమాలు	
సమయం (గంటలు)	**కార్యక్రమం**
ఉదయం 4	మంగళ హారతి
ఉదయం 4.30	తొడొపా లగ్గి, రోష హోమం
ఉదయం 5	ఒబొకాసొ
ఉదయం 5.15	సూర్య పూజ
ఉదయం 5.30	ద్వారపాలకుల పూజ
ఉదయం 5. 45 నుంచి 6.45 మధ్య	గోపాల వల్లభ సేవ, ప్రాతః దూపం, ఖిచుడి భోగం
ఉదయం 7 నుంచి 11 వరకు	సేనాపట్టా అమరిక
ఉదయం 11.45	మంగళార్పణం
మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట	అలంకరణ
మధ్యాహ్నం 1 నుంచి 2.30	గొట్టి పాహొండి
మధ్యాహ్నం 2.30 నుంచి 3.30	ఛెరా పొంహొరా
మధ్యాహ్నం 3.30 నుంచి 4	చారుమళ్ల తొలగింపు, కొయ్య గుర్రాల అమరిక
సాయంత్రం 4 నుంచి	రథాలు లాగడం ఆరంభం

నేడే బహుడా

భువనేశ్వర్: జగన్నాథుని వార్షిక రథయాత్ర అంతిమ ఘట్టం బుధవారం ప్రారంభమవుతుంది. దీనిలో భాగంగా గుండిచా అడప మండపం నుంచి శ్రీమందిరం రత్న వేదికకు మారుయాత్రలో బయల్దేరుతారు. బహుడా ఆద్యంతాలు అత్యంత ఆనందోత్సాహాలతో కొనసాగుతుంది. దారి పొడవునా అడుగడుగున పలు ముచ్చట్లు తారసపడతాయి. మౌసీ మా (పిన్నమ్మ) మిఠాయి నివేదన, లక్ష్మీనారాయణుల భేటీ చూడముచ్చట గొలిపే దృశ్యాలు. భక్తజన భావోద్వేగం ఇంధనంగా గుండిచా నుంచి శ్రీమందిరం సింహ ద్వారం ముంగిట వరకు రథాలు ముందుకు సాగుతాయి. సకాలంలో రథాలను గమ్యం చేర్చేందుకు యంత్రాంగం సకల ఏర్పాట్లు చేస్తుంది. జాప్యం పునరావృతం కాకుండా జాగ్రత్త వహిస్తుంది. అవాంఛనీయ సంఘటనల నివారణ, నియంత్రణ కోసం ప్రత్యేక పోలీసు దళాలను రంగంలోకి దింపుతున్నారు. బహుడా యాత్ర ఉత్సవాదులు, పూజలు, ఇతర కార్యకలాపాల షెడ్యూలు ఖరారు చేశారు.

సంధ్యా వేళ నుంచి..

బహుడా యాత్ర సన్నాహాలు ముందు రోజు (మంగళ వారం) సంధ్య వేళ నుంచి ఆరంభించారు. నిర్ధారిత వేళ ప్రకారం సాయంత్రం 5 గంటలకు నవమి దర్శనం నిలిపి వేశారు. అనంతరం బహుడా సన్నాహాలు చేపట్టారు. అడప మండపంపై ఆశీనులైన మూల విరాటులకు యాత్ర సంరక్షణ చర్యలను తొలుత చేపట్టారు. శ్రీఅంగాలకు ఎటువంటి భంగం వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలతో శ్రీముఖ ఖొండువా సేవ ముగించారు. ప్రధాన విగ్రహాల సురక్షిత తరలింపు కోసం బాహుట కొయ్యలను పకడ్బందీగా అమర్చారు. మండపం నుంచి కిందకు దించేందుకు వీలుగా చారుమళ్లని అమర్చి సర్వం సిద్ధం చేశారు. శ్రీ మందిరం నుంచి స్వామి కోసం తీసుకు వచ్చిన సరంజామా మూటముళ్లె సర్దారు. మండపంపై చతుర్థా మూర్తుల నిత్య సేవాదులను యథాతథంగా నిర్వహించి మరుసటి రోజు బహుడా కార్యక్రమం పట్ల దృష్టి సారించారు.

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- 130 గ్రాముల బంగారం స్వాధీనం
- 3 తుపాకీలు, 3 వాహనాలు సీజ్



మాట్లాడుతున్న ఏఎస్పీ సుబెంద్ కుమార్ పాత్రో



అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న పోలీసులు



పోలీసులు సీజ్ చేసిన వస్తువులు, బంగారం, నగదు

బరంపురం: గంజాం జిల్లా అస్కా పట్టణం దగ్గర భారత్ ఫైనాన్స్ కంపెనీ కలెక్షన్ ఏజెంట్‌పై దాడి చేసి నగదు దోచుకొని పరారైన కేసులో ఐదుగురి నిందితులను బుగడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు గంజాం ఏఎస్పీ సుబెంద్ కుమార్ పాత్రో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 9వ తేదీన కలెక్షన్ ఏజెంట్‌పై దుండగులు దాడిచేసి రూ.లక్ష నగదు దోచుకొని పరారయ్యారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టి వివిధ ప్రాంతాల్లో దాడులు చేసి 5గురు నిందితులను అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి 130 గ్రాముల బంగారం, 3 తుపాకీలు, రూ.లక్ష నగదు, 3 వాహనాలు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈనెల 14వ తేదీన గంగపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో కొండాయికల్లి జంక్షన్ దగ్గర అన్నపూర్ణ ఫైనాన్స్ కంపెనీ కలెక్షన్ ఏజెంట్‌పై మరో దోపిడీ ముఠా దాడి చేసి, రూ.లక్ష దోచుకొని పరారయ్యారు. ఈ ఘటనలో గంగపూర్ పోలీసులు శనివారం దుండగులను అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకోని, మరో ముగ్గురు నిందితులను అరెస్టు తెలియజేశారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

- కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్



మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి తగు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తెలియజేశారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన బాల కార్మికుల నిర్మూలన, కిశోరుల సంరక్షణ అవగాహన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నారులను పనిలో పెట్టడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారికి రూ.50 వేల జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. అనంతరం బాల కార్మిక చట్టాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చూపించారు. సమావేశంలో జిల్లా శ్రామిక అధికారి లోకనాథ పండా, జిల్లా శిశు సంక్షేమ కమిటీ అధికారి అశ్వినీ కుమార్ మహాపాత్రో, డీఐజీ శ్రీనివాస ఆచార్య, జిల్లా శిశు సంరక్షణ కమిటీ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, అదనపు శ్రామిక అధికారి సోమనాథ పాత్రో, జిల్లాలోని జీడి పరిశ్రమలు, గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకి యావజ్జీవ కారాగార శిక్ష



రామమూర్తి గొమాంగో

భువనేశ్వర్: భార్య హత్య కేసులో మాజీ ఎమ్మెల్యేకు న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. స్థానిక ప్రత్యేక తృతీయ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కమ్ ఎంపీ/ ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టు మంగళవారం ఈ తీర్పు వెల్లడించింది. రాయగడ జిల్లా గుణుపురం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రామమూర్తి గొమాంగో ఈ కేసులో నిందితుడు. 11 మంది సాక్షుల వాంగ్మూలాలు, 15 పత్రాలను పరిశీలించిన మేరకు ఈనెల 24వ తేదీన కోర్టు అతడిని దోషిగా నిర్ధారించిన విషయం తెలిసిందే. ఇరవై ఏడు సంవత్సరాల క్రితం ఆయన భార్య శశిరేఖ అనుమానస్పద మృతి కేసులో దోషిగా ఆయనను నిర్ధారించారు.

ఇదీ విషయం...

అప్పట్లో స్థానిక ఖారవేళ నగర్ ఎమ్మెల్యే కాలనీలోని ప్రభుత్వ వసతి భవనం బాత్‌రూమ్‌లో ఎమ్మెల్యే భార్య సగం కాలిన మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 1995 సంవత్సరం ఆగస్టు 29వ తేదీన ఈ విచారకర సంఘటన చోటు చేసుకుంది. అప్పటికి ఆమె 4 నెలల గర్భవతిగా గుర్తించారు. ఆత్మహత్యకు పాల్పడి మరణించినట్లు ప్రకటించడంతో తొలుత అసహజ మరణంగా కేసు నమోదు చేసిన పోలీసులు ఆ తర్వాత హత్య కేసుగా ధ్రువీకరించారు. ఎమ్మెల్యే ఆమెని చంపేసినట్లు ఖారవేళ నగర్ ఠాణాలో ఫిర్యాదు దాఖలు చేయడంతో కేసు విచారణ మలుపు తిరిగింది. గొమాంగో తన భార్యను హత్య చేసి, ఆమె శరీరంపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిందని చిత్రీకరించేందుకు ప్రయత్నం చేసినట్లు ప్రాసిక్యూషన్‌లో నిరూపించబడింది.

శిక్ష వివరాలు

నిందిత మాజీ ఎమ్మెల్యే రామమూర్తి గొమాంగో కోర్టులో హాజరైన తర్వాత న్యాయస్థానం శిక్ష వివరాలను ప్రకటించింది. సెక్షన్ 302 కింద యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది శిక్ష విధించింది. సాక్ష్యాధారాల గల్లంతు, రద్దు చేసిన నేరం రుజువు కావడంతో 201 సెక్షన్ కింద రూ.10 వేల జరిమానా, జరిమానా జమ చేయని పక్షంలో 6 నెలల శిక్షని ఎంపీ/ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టు ప్రకటించింది.

రామమూర్తి రాజకీయ నేపథ్యం

1995లో గుణుపురం నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి జనతాదళ్ టికెట్‌పై ఎన్నికైన రామమూర్తి గొమాంగో 2000 సంవత్సరంలో బీజేపీలో చేరారు. 2000లో గుణుపూర్ నుంచి బీజేపీ టికెట్‌పై పోటీచేసి, 30 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో తిరిగి ఎన్నికయ్యారు. 2004 అసెంబ్లీ ఎన్నికలలో అతను తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి హేమా గొమాంగోపై 20,000 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. 2009లో బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ కూటమి కుప్పకూలడంతో బీజేపీ నుంచి దూరం అయ్యారు. అయితే 2014 సంవత్సరం సార్వత్రిక ఎన్నికల్లో గుణుపురం అసెంబ్లీ స్థానానికి పోటీ చేసేందుకు బీజేడీ టిక్కెట్ నిరాకరించడంతో ఆయన తిరిగి బీజేపీలో చేరారు.

నిత్యావసర ధరలపై కాంగ్రెస్ ఆందోళన



ఆర్‌డీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బరంపురం: పెరుగుతున్న నిత్యావసర ధరలను నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్వర్యంలో దక్షిణాంచల్ ఆర్డీసీ కార్యాలయం ఎదుట జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు రమేష్ చంద్ర జెన్నా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నిత్యావసర సరుకులు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రజలను ఆదుకోకుండా మరింత భారం పెంచడం సరికాదన్నారు.

అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపడం సరికాదని హితవు పలికారు. వలస కార్మికులకు ఉపాధి కల్పించాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు రమేష్ చంద్ర జెన్నా ఆధ్వర్యంలో కొత్తవారిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నితీష్ వాద్వానీ

మల్కన్‌గిరి: జిల్లా పోలీసులు ద్విచక్ర వాహనాల దొంగతో పాటు ఆ వాహనాలను కొనుగోలు చేస్తున్న మరో ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేశారు. ఘటనపై ఎస్పీ నితీష్ వాద్వానీ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 25వ తేదీన కలిమెల పోలీసుస్టేషన్‌లో బెడ గ్రామానికి చెందిన మహాదేవ్ ఖిల అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనం దొంగతనానికి గురయ్యిందని ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎంవీ 66 గ్రామం దగ్గర పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో ఒక వ్యక్తి వాహనాన్ని పరిశీలించగా, అది దొంగతనానికి గురైన వాహనంగా గుర్తించారు. వెంటనే అతడిని అరెస్టు చేసి విచారించగా అతడు నేపాల్ రాష్ట్రం ఖాట్మాండ్ జిల్లా లలిత్‌పూర్ గ్రామానికి చెందిన గోర్కా జానుగా గుర్తించాడు. అతడు ఒడిశాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో సైతం ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసినట్లు తేలింది. దొంగతనం చేసిన వాహనాలను మల్కన్‌గిరి జిల్లా కలిమెల పోలీసుస్టేషన్ దాతునగుడ గ్రామానికి చెందిన అర్జున హంతాల, కుర్మానుర్ గ్రామానికి చెందిన దీపక్ మండల్‌కు అమ్ముతున్నట్లు విచారణలో వెల్లడించారు. వెంటనే వారిని పోలీసులు అరెస్టు చేసి, 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న వాహనాలు చూపిస్తున్న పోలీసులు



బరంపురం: పాతాలేశ్వర్‌లో శ్రీరాముని అవతారంలో దర్శనమిస్తున్న జగన్నాథ స్వామి



బరంపురం: హనుమాన్ బజార్‌లో ప్రత్యేక తులసీ మాలలతో దర్శనమిస్తున్న దేవతామూర్తులు



బరంపురం: బెజ్జిపూర్‌లో పరుశురాముని, వామన అవతారాల్లో జగన్నాథుడు, బలభద్రుడు



పర్లాకిమిడి: బహుదా యాత్రకు సిద్ధమవుతున్న రథాలు

భక్తిశ్రద్ధలతో పూజలు

- వివిధ అలంకారాల్లో జగన్నాథుడు

రథయాత్ర ఉత్సవాలు మంగళవారం సందడిగా కొనసాగాయి. గుండిచా మందిరాల్లో కొలువైన జగన్నాథుడు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులను ఆలయవర్గాలు ప్రత్యేకంగా అలంకరించారు. మరోవైపు బహుదా యాత్రకు రథాలను సిద్ధం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జయపురం: పూజలందుకుంటున్న దేవతామూర్తులు



బరంపురం: కోర్టుపేటలో శ్రీరాముని అవతారంలో జగన్నాథుడు



బరంపురం: మిలటరీ లైన్‌లో శ్రీరాముని అవతారంలో దర్శనమిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: కల్కి అవతారంలో జగన్నాథుడు



రాయగడ: బుద్ధావతారంలో పూజలందుకుంటున్న జగన్నాథుడు

విద్యుత్ కోతలపై ఆగ్రహం

- బిల్లులు తగ్గించాలని డిమాండ్
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యాలయాల ముట్టడి

రాయగడ: అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగో ఆధ్వర్యంలో స్థానిక సెరిగుడ వద్దనున్న విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం ధర్నా చేపట్టాయి. అనంతరం ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గొమాంగో మాట్లాడుతూ ప్రతినెల నిర్దిష్ట కాలంలో విద్యుత్ బిల్లులు వినియోగదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విద్యుత్ బకాయిల వసూళ్ల సమయంలో సయమనం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శంకర్షన్ మంగరాజ్, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మజ్జి శంకర రావు, సీనియర్ నాయకుడు జీవితేశ్వరరావు, అప్పలస్వామి కద్రక తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో తరుచూ విద్యుత్ కోతలకు నిరసనగా విద్యుత్ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ముట్టడించారు. విద్యుత్ కోతలతో పాటు విద్యుత్ బిల్లులు సైతం విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. రోజులో ఎక్కువ సమయం విద్యుత్ కోతలు ఉంటుండడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు బస్టాండ్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గోలింద పాత్రో, శరత్ చంద్ర బురద, భుజబాల్ మాఝి తదితరులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు

పర్లాకిమిడి: రాష్ట్రంలో విద్యుత్ సరఫరాను టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి ఇవ్వడం వలన ప్రతిరోజూ అప్రకటిత కోతలు విధిస్తున్నారని, అలాగే విద్యుత్ బిల్లులు భారీగా పెంచేశారని మోహనా నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే దాశరథి గోమాంగో అన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరత పట్నాయక్ ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ కార్యాలయం నుంచి టాటా పవర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు దాశరథి గొమాంగో మాట్లాడుతూ టాటా పవర్ కంపెనీ జిల్లాలో మారుమూల గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వేసింది కానీ బిల్లులు విపరీతంగా పెంచేసిందని పేర్కొన్నారు. ఆందోళనలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బసంత పండా, అభిమన్యు పండా, సంగ్రాం సాహు, పట్టణ యువజన కాంగ్రెస్ నాయకులు సూర్యనారాయణ పాత్రో, ఈశ్వర్ మఝి, బబులీ సాహు, రాజా పాత్రో తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: విద్యుత్ కార్యాలయం ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కొరాపుట్: విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలో ఎంపీ సప్తగిరి ఉల్క ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉల్క మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలు, బిల్లులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆందోళనలో డీసీసీ అధ్యక్షుడు దుర్గా శంకర్ సాహు, పార్టీ పరిశీలకుడు దుర్గా పండా(రాయగడ), కోట్‌పాడ్ మున్సిపల్ చైర్మన్ శంకరరావు, సీనియర్ నాయకులు బీరేన్ పట్నాయక్, రుపక్ తురుక్ తదితరులు పాల్గొన్నారు.



కొరాపుట్: నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ సప్తగిరి ఉల్క తదితరులు



రాయగడ: విద్యుత్ ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భళా.. మామిడి పండ్ల మేళా

జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఓర్మాస్ సంస్థ ఆధ్వర్యంలో మామిడి పండ్ల మేళాను కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, ఎస్‌డీసీ చైర్మన్ మరియం రైయితోలు మంగళవారం ప్రారంభించారు. ఈనెల 29 వరకు మొత్తం మూడు రోజుల పాటు మేళా జరుగుతుందని అధికారులు తెలియజేశారు. మేళాలో గజపతి జిల్లాలో పండిన మామిడిపండ్లతో పాటు కొరాపుట్, అనుగుల్, బలంగీర్, కలహండి, రాయగడ, సంబల్‌పూర్ జిల్లాల నుంచి వేర్వేరు రకాలు మామిడి పండ్ల ఉన్నాయి. ముఖ్యంగా ఆమ్రపల్లి, లెంగడా, దశరీ, బంగినపల్లి, ఏనుగు తలకాయలు, మల్లికా రకాలు ఉన్నాయి. స్టాల్స్‌ను ఉద్యానవన శాఖ అధికారి సుశాంత రంజన్ మఝి, డిప్యూటీ డైరెక్టర్ సుశాంత రంజన్ దాస్, ఓర్మాస్ దిలీప్ కుమార్ సాహు, ఒడిశా జీవనోపాధుల శాఖ డీపీఎం ప్రియంవద బిసాయి, మిషన్ శక్తి డీపీఏ మనస్మితా పాత్రో తదితరులు పాల్గొన్నారు.

– పర్లాకిమిడి



స్వయం సహాయక సంఘాల మహిళలతో కలెక్టర్



మామిడిపండ్ల మేళా వేదిక

నకిలీ విదేశీ మద్యం స్వాధీనం

రాయగడ: స్థానిక కస్తూరీ నగర్‌లో నకిలీ విదేశీ మద్యం వ్యాపారిని ఎక్సైజ్ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఖాళీ మద్యం బాటిళ్లలో హోమియోపతి వైద్యానికి సంబంధించిన బెల్‌డొనా–30 రకం సిరప్‌ను నింపి, అందులో మద్యం కలర్ వచ్చేలా పంచదార ద్రావణాన్ని కలిపి విదేశీ మద్యంగా మార్కెట్‌లో చెలామణి చేస్తున్న రతన్నాలు వెంకట చౌదరి(49) అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్దనుంచి 76 నకిలీ విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారి అభిరాం బెహర తెలియజేశారు. గత కొన్నేళ్లుగా ఇటువంటి తరహా మద్యం బాటిళ్లను రూపొందించి పొరుగు రాష్ట్రంలోని పుడేసు, కూనేరు, ఎండభద్రమ్ తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నకిలీ విదేశీ మద్యంతో నిందితుడు వెంకట చౌదరి

అంతులేని విషాదం

- రోడ్డు ప్రమాదంలో కుటుంబం దుర్మరణం



మృతి చెందిన కుటుంబం (ఫైల్)



కారులో చిన్నారి మహి మృతదేహం



కారులో రవి, రస్మిత మృతదేహాలు

కొరాపుట్: పెళ్లి పిలుపులకు వెళ్తూ కుటుంబం మొత్తం దుర్మరణం పాలైన విషాదకర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఉదయం కొరాపుట్ జిల్లా పొట్టంగి–సిమిలి గుడల మధ్య పుంగార్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. జయపుర్ పట్టణంలోని పుర్ణాఘడ్ ప్రాంతానికి చెందిన రవి ప్రధాన్(35), అతని భార్య రస్మితా ప్రధాన్(32), కుమార్తె మహి ప్రధాన్ (6)లు కారులో సిమిలి గుడ సమితి మాలిమర్ల గ్రామానికి బయల్దేరారు. మృతుడు బావ మరిది పెళ్లి ఉండడంతో ఆడపెళ్లి వారిని పెళ్లి పిలుపు కోసం వెళ్తున్నారు. అదే సమయంలో గంజాం జిల్లా నుంచి ఆసిడ్ ట్యాంకర్‌తో దమంజోడిలో భారత అల్యూమినియం కేంద్రం(నాల్కో)కి లారీ వస్తోంది. రెండు వాహనాలు జాతీయ రహదారి మీద ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ఉన్నవారు అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలను క్రమబద్ధీకరించారు.

క్లుప్తంగా

చదువుపై దృష్టి సారించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టిపెట్టాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో క్లాస్‌వర్కును మంగళవారం పరిశీలించారు. ప్రీ యూనివర్సిటీ కోర్సు, ఇంజినీరింగ్ క్లాస్‌లు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహం నిర్వహణ, భోజన నాణ్యత వంటివి అడిగి తెల్సుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యం నిర్దేశించుకుని ముందుకుసాగాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ మేరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సజావుగా సీఆర్టీల బదిలీల కౌన్సెలింగ్



సీఆర్టీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీ (కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్)ల బదిలీల కౌన్సెలింగ్ ఐటీడీఏలో పీఓ కల్పనాకుమారి సమక్షంలో మంగళవారం జరిగింది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లా పరిధిలో మొత్తం 120 మందికి బదిలీలు చేశారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్లు గణితం -28 మంది, పీఎస్-16, బీఎస్-24, సోషల్-14, ఎస్‌ఏ తెలుగు-7, హిందీ-6, ఇంగ్లిష్-18, పీడీలు ఏడుగురు ఉన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీ రాణి, ఏటీడబ్ల్యూఓ కృష్ణవేణి, ఏఎంఓ కోటిబాబు, హెచ్‌ఎంలు కె.సుబ్బారావు, చంద్రరావు, నారాయుడు, సూర్యం, ఉమావాణి, తదితరులు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్లు నిర్వహణకు సహకరించండి



మాట్లాడుతున్న మంచు కృష్ణారావు

నరసన్నపేట: శాలివాహనా స్పిన్నింగ్ మిల్లు జిల్లాకు చెందిన చేనేత కార్మికుల కల అని, దీనిని నెరవేర్చేందుకు చేస్తున్న కృషికి అందరూ సహకరించాలని స్పిన్నింగ్ మిల్ బోర్డు చైర్మన్ మంచు కృష్ణారావు కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మిల్లు నిర్వహణకు కొత్తగా మిషన్లు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అంత డబ్బు లేని కారణంగా స్పిన్నింగ్ మిల్లు బోర్డు పరిధిలోని 21 ఎకరాల్లో 4 ఎకరాలు అమ్మకానికి ప్రతిపాదించామన్నారు. 40 ఏళ్ల కిందట స్పిన్నింగ్ మిల్ నిర్మాణం కోసం పొట్నూరు వంశీకులు అప్పట్లో 26 ఎకరాల 89 సెంట్లు దానం చేశారని గుర్తు చేశారు. దీంట్లో కొంత స్థలంలో మహిళా రెసిడెన్సియల్ కళాశాలను ప్రభుత్వం నిర్మించిందని, మరి కొంత స్థలంలో రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. మిగిలిన ఈ భూములపై సర్వ హక్కులు స్పిన్నింగ్ మిల్ బోర్డుకే ఉన్నాయని స్పష్టం చేశారు. కౌలు రైతులకు ఎటువంటి సంబంధం లేదన్నారు. జిల్లాలో చేనేత కార్మికులు అభివృద్ధి చెందాలంటే ఇక్కడ స్పిన్నింగ్ మిల్ నిర్వహణ చేయాలని, దీనికి కొత్త మిషన్లు కొనుగోలు అవసరమన్నారు. అందరూ మిల్లు నిర్వహణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మీ వద్దకే పీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి రామారావు

పార్వతీపురం: ఎంప్లాయీస్ ప్రావిడెంట్‌ఫండ్ (ఈపీఎఫ్) ఉద్యోగులకు ఇంటి వద్దకే వచ్చేలా చర్యలు చేపడతామని నోడల్ అధికారి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వై. రామారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో మీ వద్దకే పీఎఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపీఎఫ్‌కు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పీఎఫ్ సభ్యులు, పింఛనర్లు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్టోర్స్‌లో ఇంటిదొంగలు!

- పొందూరుకు అక్రమంగా తరలివెళ్లిన 10 ఇనుప ఛానల్స్
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు
- ఔట్ డోర్ ఏఈ రమాదేవిపై సస్పెన్షన్ వేటు



విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్ ఇదే...

అరసవల్లి : విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్‌లో విలువైన సామగ్రి బయటకు తరలిపోయింది. విషయం బయటకు రావడంతో విద్యుత్ విజిలెన్స్ అధికారులు రెండు రోజులుగా విచారణ చేపట్టారు. విద్యుత్ సర్కిల్ ఎస్‌ఈ ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ కమిటీ చేపట్టిన దర్యాప్తులో అక్రమంగా 10 ఐరన్ ఛానల్స్ తరలించినట్లుగా నిర్ధారణ కావడంతో జిల్లా స్టోర్స్‌లో ఔట్ డోర్ ఏఈగా పనిచేస్తున్న బి.రమాదేవిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ ఘటన విద్యుత్ శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది.వివరాల్లోకి వెళితే.. నాలుగైదు రోజుల క్రితం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్‌లో కొన్ని ఇనుప వస్తువులు, విద్యుత్ సామగ్రి అక్రమంగా బయటకు వెళ్లిపోయాయనే ఫిర్యాదుతో విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుపెట్టారు. అక్కడే పనిచేస్తున్న కొందరు అధికారుల చేతివాటంతోనే ఈ అక్రమం జరిగిందని దాదాపుగా నిర్ధారణకు వచ్చారు. వివిధ మండలాలకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు గాను పలు రకాల సామగ్రిని ప్రభుత్వ వాహనాల ద్వారా తరలించే ప్రక్రియలో భాగంగా అక్రమంగా కొన్ని ఇనుప ఛానల్స్‌ను వాహనాల్లో ఎక్కించి పొందూరు మండలంలో ఓ ప్రాంతానికి తరలించినట్లుగా గుర్తించారు. అనంతరం పొందూరు మండలంలో అక్రమంగా దాచి ఉంచిన ఇనుప వస్తువులను గుర్తించిన విజిలెన్స్ అధికారులు జిల్లా స్టోర్స్ నుంచి ఎలా బయటకు వచ్చాయనే కోణంలో విచారణ కొనసాగించారు. విద్యుత్ సర్కిల్ ఎస్‌ఈ దైవప్రసాద్ కూడా తీవ్రంగానే స్పందించి ఈ వ్యవహారంపై రెండ్రోజుల క్రితమే విచారణకు ప్రత్యేక కమిటీని నియమించారు. అటు విజిలెన్స్..ఇటు విద్యుత్ శాఖ సర్కిల్ అధికారులు కూడా దాదాపుగా ప్రాథమికంగా నిర్ధారణ దిశగా నివేదికలను తయారు చేయగా.. ఎస్‌ఈ తక్షణ చర్యల్లో భాగంగా ఔట్ డోర్ ఏఈ రమాదేవిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పొందూరులో కదిలిన డొంక:

ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉండే విద్యుత్ శాఖ స్టోర్స్‌లో గతంలో కూడా ఇలాంటి అక్రమ తరలింపులు జరిగాయి. వీటిపై అప్పట్లో 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా ఇదే స్టోర్స్‌లో సామగ్రిని పొందూరుకు అక్రమ తరలింపు వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. నాలుగైదు రోజుల క్రితమే ఈ వ్యవహారం జరిగినప్పటికీ.. ఇందులో పాత్ర ఉన్న అధికారుల మధ్య బేధాభిప్రాయాలు రావడంతో వీరిలో ఒకరు విజిలెన్స్‌కు తెలిసేలా చేసినట్లు భోగట్టా. దీంతో విజిలెన్స్ అధికారుల తనిఖీలతో ఒక్కసారిగా కథ అడ్డం తిరిగింది. ఇటు స్టోర్స్ ఇన్‌చార్జి, ఇన్‌డోర్ ఏఈ, ఔట్ డోర్ ఏఈతో పాటు అక్రమంగా డంప్ చేయబడిన పొందూరు సెక్షన్ పరిధి ఏఈ తదితర ఉద్యోగులందరి పాత్రలపై విజిలెన్స్ నిఘా ఉంచింది. ప్రస్తుతానికి ఔట్ డోర్ ఏఈ రమాదేవిపై వేటు పడినప్పటికీ.. ఇది ప్రాథమిక చర్యగానే అధికారులు స్పష్టం చేస్తున్నారు. మిగిలిన అధికారుల నిర్లక్ష్యంపైనా చర్యలకు దిగనున్నట్లు సమాచారం.

సస్పెండ్ చేశాం..



స్టోర్స్‌లో 10 వరకు ఇనుప ఛానల్స్‌ను అక్రమంగా పొందూరుకు తరలించిన వ్యవహారంలో ప్రాథమిక విచారణ ఆధారంగా ఔట్ డోర్ ఏఈ రమాదేవిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశాం. ఆమె స్థానంలో ఇన్‌డోర్ ఏఈకి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించనున్నాం. స్టోర్స్‌లో నిర్లక్ష్యంగా పనిచేసిన వారిని గుర్తించడంతో పాటు జిల్లా స్టోర్స్‌లో మరింత నిఘా పెంచేలా చర్యలు చేపడతాం.

– ఎల్.దైవప్రసాద్, ఎస్‌ఈ

సీవీఓకు నివేదిక..



జిల్లా స్టోర్స్ నుంచి అక్రమంగా విద్యుత్ సామగ్రి తరలించారన్న సమాచారంతో ముందుగా పొందూరులో 10 ఇనుప ఛానల్స్‌తో పాటు విద్యుత్ కేబుల్స్‌ను గుర్తించాం. అక్కడి నుంచే విచారణ కొనసాగించాం. బాధ్యులను గుర్తించాం. నివేదికను సిద్ధం చేసి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రసన్నకుమార్‌కు అందజేయనున్నాం.

– ఎం.వెంకట నారాయణ, సీఐ విజిలెన్స్

డిగ్రీ, బీఈడీ నాలుగేళ్లలోనే..

- సమీకృత ఉపాధ్యాయ డిగ్రీ కోర్సులో ప్రవేశాలకు ఆహ్వానం
- బీఏ ఎడ్యుకేషన్‌లో 50 సీట్లు, బీఎస్సీ ఎడ్యుకేషన్‌లో 50 సీట్లు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: వీసీ



వివరాలు వెల్లడిస్తున్న వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ ఏడాది నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రారంభిస్తున్న నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా డిగ్రీ కోర్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు పిలుపునిచ్చారు. వర్సిటీలో మంగళవారం వివరాలు వెల్లడించారు. జాతీయ స్థాయిలో 42 విద్యాసంస్థలకు జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి ఈ కోర్సు మంజూరు చేసిందన్నారు. ఏపీలో రెండు విద్యా సంస్థలకు గాను అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఒకటని పేర్కొన్నారు. ఈ ఏడాది బీఏ ఎడ్యుకేషన్ (హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్)లో 50 సీట్లు, బీఎస్సీ ఎడ్యుకేషన్ (గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో 50 సీట్లతో కోర్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిగ్రీతో పాటు బీఎడ్ నాలుగేళ్లలో పూర్తవుతుందని చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు 42 విద్యా సంస్థలకు కలిపి దేశవ్యాప్తంగా 178 నగరాల్లో, 13 భాషల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుందని వివరించారు. ఈ నెల 26న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, జూలై 19న చివరి తేదీ అని చెప్పారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో కంప్యూటర్ బేస్ట్ విధానంలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్, ఎన్‌సీఈటీ.సమ్రత్.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. నూతన విద్యావిధానంలో భాగంగా ఈ కోర్సులను డిజైన్ చేశారని, ప్రమాణాలతో కూడిన ఉపాధ్యాయ విద్య అందుతుందని వివరించారు. అమెరికా, కెనడా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో అధ్యయనం చేసి ఈ కోర్సు అమల్లోకి తెస్తున్నట్లు వివరించారు. డిగ్రీ మూడేళ్లు, బీఎడ్ రెండేళ్లు చదవాల్సిన అవసరం లేకుండా కేవలం నాలుగేళ్లలోనే మొత్తం కోర్సు పూర్తవుతుందని వివరించారు. విజయవంతంగా కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత సాధిస్తారని తెలిపారు. 160 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు.

రుణాల మంజూరుకు ముందుకురావాలి



వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, బ్యాంక్ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో రైతులకు, మహిళలకు సకాలంలో రుణాలు మంజూరుచేసి ఆర్థిక సాధికారత సాధించేందుకు దోహదపడాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్ష కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలకు విరివిగా రుణాలు మంజూరు చేసి జిల్లా పారిశ్రామికంగా ఎదిగేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఈ ఏడాది రూ.14,400 కోట్ల మేర రుణాలు మంజూరు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందులో రూ.8,597 కోట్లు ప్రాధాన్యతారంగానికి ఉండగా, అందులో రూ.6,780 కోట్లు రైతులకోసం వెచ్చించనున్నట్లు వివరించారు. 2023-24 వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలు వాస్తవానికి దగ్గరగా ఉండాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ బ్యాంకు అధికారులను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరంలోనూ అధికంగా రుణాలు మంజూరుచేయాలని కోరారు. అనంతరం 2023-24 వార్షిక రుణ ప్రణాళికను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్‌డీఎం ఎం.సూర్యకిరణ్, డీసీసీ కన్వీనర్, యూబీఐ రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్, నాబార్డ్ డీడీ ఎం కె.వరప్రసాద్, ఆర్‌బీఐ ఏజీఎం రెహమాన్, యూబీఐ ఆర్‌సెటీ డైరెక్టర్ కె.శ్రీనివాస్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ టి.ఆర్.ఎం.రాజు, ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్లు శ్రీరాఘవేంద్ర, ఆనందరావు, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్, మెప్మా పథక సంచాలకులు ఎం.కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ, ఇతర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుములు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

విద్యార్థుల ఔదార్యం.. పాఠశాలకు విరాళం



నగదు ప్రోత్సాహకాన్ని విరాళంగా అందజేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: విద్యార్థులు తమకు అందిన నగదు ప్రోత్సాహం మొత్తాన్ని పాఠశాలకు విరాళంగా అందజేసిన ఘనత సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం విద్యార్థులకు దక్కింది. గత విద్యా సంవత్సరం(2022-23)లో 10వ తరగతిలో 574 మార్కులు సాధించిన కానూరు సాధనప్రియకు రూ.3వేలు, 573 మార్కులు సాధించిన కింజరాపు కావ్యశ్రీకు రూ.2వేలు, 562 మార్కులు సాధించిన కొన్న చాందినికు రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం ఇటీవల అందజేసింది. ఆ నగదును పాఠశాల అభివృద్ధికి వినియోగించాల్సిందిగా ముగ్గురు విద్యార్థులు మంగళవారం హెచ్‌ఎంకు విరాళంగా అందజేశారు. వీరిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, కృష్ణవేణి, మార్కండేయులు, సీఆర్‌పీ గిరి, రోజా, దయాసాగర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజయనగరం ,శ్రీకాకుళానికి ఈట్‌రైట్ స్టేషన్‌గా గుర్తింపు

విజయనగరం టౌన్: విజయనగరం,శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లకు ఈట్‌రైట్ స్టేషన్‌గా గుర్తింపు లభించింది. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ సంస్థ ప్రతినిధులు గతంలో ఆ రైల్వేస్టేషన్‌లను సందర్శించి హైజెనిక్ ఫుడ్, వాడుతున్న పరికరాలు, పాగగొట్టాలు, ఫ్యాన్స్, స్టాండర్డ్స్‌ను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండడంతో ఈ రెండు స్టేషన్‌లకు ఈట్‌రైట్ స్టేషన్‌గా గుర్తింపు నిచ్చారని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. గడిచిన మూడు నెలల క్రితం విశాఖ రైల్వేస్టేషన్‌కు ఈ గుర్తింపు లభించింది. విజయనగరం ,శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లకు గుర్తింపు రావడంతో రైల్వే అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో మృతదేహం

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి పెట్రోల్ బంకు వద్ద మంగళవారం వేకువజామున గుర్తుతెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సురేంద్రనాయుడు తెలిపారు.వాహనం బలంగా ఢీ కొట్టడంతో మృతుడి తల నుజ్జునుజ్జయి పోల్చుకోలేని విధంగా ఉందని చెప్పారు. మృతునికి 50 ఏళ్లు ఉంటాయని, నల్లని షర్ట్, తెల్లని షార్ట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించి, కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రైల్వే భద్రతా నియమాలపట్ల అవగాహన కల్పించాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ వెంకట్రావు


పార్వతీపురం: రైల్వే భద్రతా నియమాలపట్ల ప్రయాణికులకు అవగాహన కల్పించాలని విశాఖపట్నం లైన్స్ (జీఆర్‌పీ)సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు సిబ్బందికి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం రైల్వేస్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విధులను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రైల్లో అక్రమంగా జరుగుతున్న మాదక ద్రవ్యాల రవాణాను నిరోధించాలని కోరారు. ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో లోకల్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ విధులను నిర్వహించాలని చెప్పారు. రైలులో ప్రయాణిస్తున్న వారికి ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదకరమని, దీనిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ పరిశీలనలో రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి..

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన యువకుడు విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్.కోట ఎస్సై తారకేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. , ధర్మవరం గ్రామానికి చెందిన అల్లు రామకృష్ణ (32) శనివారం రాత్రి తన కళ్లం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన బంధువులు ఆదివారం ఎస్.కోట సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌లో చేర్చారు. మృతుడి తండ్రి జనవరి నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్యకు యావజ్జీవం

- తీర్పునిచ్చిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి



ముద్దాయి విజయలక్ష్మి

విజయనగరం లీగల్: భర్తను హతమార్చిన కేసులో కొత్తవలస మండలం తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన ముద్దాయి అడ్డూరి విజయలక్ష్మికి జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణ చక్రవర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అనాథలైన ఇద్దరు పిల్లలకు చెరో రూ.మూడు లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురాం అందించిన వివరాలిలా ఉన్నాయి. ముద్దాయి భర్త దేముడు కొత్తవలస గ్యాస్ కంపెనీలో పనిచేసేవాడు. సుమా రు 14 ఏళ్ల క్రితం విజయలక్ష్మితో పెళ్లయింది. అనంతరం వారికి ఒక అమ్మాయి, అబ్బాయి పుట్టారు. ఇదిలా ఉండగా భార్య విజయలక్ష్మి పరాయి వ్యక్తులతో వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త తరచూ తగాదా పడుతుండేవాడు. దీంతో పాటు చెప్పా పెట్టకుండా ఇంట్లో నుంచి విజయలక్ష్మి ఉదయం వెళ్లడం, సాయంత్రం ఇంటికి రావడం చేస్తుండేది. ఈ విషయమై భార్యను పలుమార్లు నిలదీశాడు. ఈ నేథ్యంలో భర్త అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న విజయలక్ష్మి 2019 సెప్టెంబర్ 2న రాత్రి భర్త పొట్టపై కత్తితో దాడి చేసింది.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దేముడు చికిత్స పొందుతూ మరునాడు మృతిచెందాడు. మృతుడి సమీప బంధువు మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కొత్తవలస ఎస్సై బి.మురళి కేసునమోదు చేసి నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ జి.గోవిందరావు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ 18 మంది సాక్షులను కోర్టులో విచారణ చేసి అభియోగం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

విద్యుత్ షాక్‌తో సచివాలయ లైన్‌మేన్ మృతి



ఎర్రయ్య(ఫైల్)

జి.సిగడాం: మండలంలోని వెలగాడ సచివాలయంలో విద్యుత్ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.ఎర్రయ్య (33) మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విధి నిర్వహణలో భాగంగా ఎర్రయ్య మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో వెలగాడలో ఎల్‌సీ తీసుకుని స్తంభం ఎక్కి విధులు నిర్వహిస్తుండగా పక్కనే ఉన్న హెవీలైన్ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడి నుంచి కిందకు పడిపోయాడు. స్థానికులు స్పందించి 108 వాహనంలో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తలకు, గుండెకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందాడు. ఎర్రయ్యకు భార్య లక్ష్మి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పేద కుటుంబాన్ని ఆదుకోవాలి..

నిరుపేద కుటుంబానికి చెందిన ఎర్రయ్య పుట్టినప్పటి నుంచి ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. కష్టపడి చదివి సచివాలయం ఉద్యోగం సాధించాడు. భార్య, ఇద్దరు ఆడ పిల్లలతో ఆనందంగా జీవిస్తున్న తరుణంలో మృత్యువు వెంటాడింది. ఎర్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న ఏఈఈ తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి చేబ్రోలు సురేష్, తోటి ఉద్యోగులు ఎర్రయ్య కుటుంబాన్ని ఓదార్చారు. కాగా, ఎర్రయ్య మృతి వార్త తెలియగానే స్వగ్రామం మధుపాంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎర్రయ్య మృతిపట్ల సర్పంచ్ బగాది అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ నల్లి తవిటినాయుడు, ముగ్గు శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



తైక్వాండోలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అనిల్ శర్మ

పార్వతీపురంటౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లా స్థాయిలో సోమవారం నిర్వహించిన తైక్వాండో పోటీల్లో పార్వతీపురం పట్టణానికి చెందిన విద్యార్థులు జూనియర్ విభాగంలో ప్రతిభ కనబరిచారు. అనిల్ శర్మ తైక్వాండో అకాడమీలోని విద్యార్థులు ఆరు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. అలాగే కేడెట్‌లో రెండు గోల్డ్‌మెడల్స్, సిల్వర్ మెడల్స్ రెండు, బ్రాంజ్ మెడల్స్ రెండు సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు జూలై 1, 2వ తేదీల్లో చిత్తూరు జిల్లాలోని, తిరుపతిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు.

బ్యాంకు అకౌంట్‌లోరూ. 50వేలు మాయం

రాజాం సిటీ: పోయిన ఫోన్ నంబర్ స్థానంలో కొత్త నంబర్‌ను బ్యాంకు అకౌంట్‌కు యాడ్ చేయకపోవడంతో ఓ వ్యక్తి తన అకౌంట్ నుంచి రూ. 50వేలు పోగొట్టుకున్నాడు. ఆలస్యంగా విషయం తెలుసుకుని పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన గండివల్లి పుష్పనాథం పొగిరి లెప్రసీ ఆస్పత్రిలో పనిచేసి 15ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందాడు. అప్పటి నుంచి తన పింఛన్ మొత్తం యూనియన్ బ్యాంకు అకౌంట్‌కు జమ అవుతోంది. ప్రతి నెలా ఆ డబ్బు చెక్‌బుక్ ద్వారా విత్‌డ్రా చేసుకునేవాడు. ఈ నెలలో తన పింఛన్ డబ్బులు అకౌంట్‌లో జమ అయింది లేనిది చెక్ చేసుకునేందుకు బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకు సిబ్బంది అకౌంట్‌లో రూ.7,455లు మాత్రమే ఉన్నాయని చెప్పడంతో అకౌంట్‌లో రూ.58వేలు ఉండాలని, మరోసారి చెక్‌చేయాలని అభ్యర్థించాడు. వెంటనే మరోసారి అకౌంట్‌ను చెక్‌చేసిన బ్యాంకు అధికారులు సంబంధిత అకౌంట్‌కు లింక్ అయిన ఫోన్ (8520879739) నంబర్ నుంచి యూపీఐ ద్వారా రూ. 30వేలు, రూ. 20వేలు చొప్పున రెండుసార్లు లావాదేవీలు జరిగాయని వెల్లడించారు. దీంతో కంగుతిన్న బాధితుడు ఇది గతంలో తాను వాడిన నంబర్ అని, ప్రస్తుతం ఉపయోగించని కారణంగానే సంబంధిత మెసేజ్‌లు రావడంలేదని లబోదిబోమన్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు తన అకౌంట్ నుంచి పాత మొబైల్ నంబర్‌ను ఉపయోగించి యూపీఐ చెల్లింపులు చేసి నగదు కాజేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు.